క్లుప్తంగా

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన పూజ



పలమనేరు: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో మదర్ థెరీసా కళాశాలకు చెందిన పూజ ఫస్ట్ ఇయర్‌లో 460/441మార్కులను సాధించిందని కళాశాల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. పూజకు, ఆమె తల్లిదండ్రులు స్వీట్లు అందజేసి అభినందించింది.

క్రికెట్ విజేత బాయ్స్ ఆఫ్ బాలు జట్టు



విజేతగా నిలిచిన బాయ్స్ ఆఫ్ బాలు జట్టు

పలమనేరు: పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన హెచ్‌పీఎల్ క్రికెట్ ఫైనల్స్‌లో స్థానిక బాయ్స్ ఆఫ్ బాబు జట్టు ఐసీసీ జట్టుపై గెలిచి విజేతగా నిలిచింది. టోర్నమెంట్ నిర్వాహకులు బ్రహ్మక్రిష్ణ, శ్రీనివాసులు విన్నర్స్ జట్టుకు కప్పును అందజేశారు. కార్యక్రమంలో విజేత జట్టు కోచ్ బాలు, స్థానిక క్రికెటర్లు రంజిత్‌షా, నాగరాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు



ఎంపీ, ఎమ్మెల్యేకు వేద పండితుని ఆశీర్వచనం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను హిందూపురం ఎంపీ పార్థసారథి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ మర్యాద్యాలతో ఈఓ ఏకాంబరం వారికి స్వాగతం పలికారు. ప్రత్యేక అర్చనలు, అభిషేక పూజల అనంతరం అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం పలికారు.

కోదండరాముడి భిక్షాటన ఉత్సవం



సీతాదేవి అలక తీర్చే ఉత్సవం

కాణిపాకం: సీతాదేవి అలక తీర్చే ఘట్టాన్ని వేదపండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. చిత్తూరు నగరం రాములుగుడివీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం వార్షిక బ్రహ్మోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం స్వామి భిక్షాటనలో భక్తులకు దర్శనమిచ్చారు. నగరవీధుల్లో ఊరేగించారు. తర్వాత ఆలయ ఆవరణలో సీతాదేవి అలక తీర్చే ఉత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు. ఈ కార్యక్రమం గంటన్నరపాటు సంప్రదాయబద్ధంగా కొనసాగింది. అనంతరం ఈ ఘట్టం విశేషాన్ని పండితులు వివరించారు. కార్యక్రమంలో అర్చకులు వేణుగోపాల్, ఈవో సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

ముత్తుకూరులో కార్డెన్ సెర్చ్

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం ముత్తుకూరు గ్రామంలో ఆదివారం బీఎన్ఆర్‌పేట పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో లక్ష్మీపతి అనే వ్యక్తి ఇంట్లో మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. 23 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కచ్చితంగా అక్రమ మద్యం విక్రయాలపై చర్యలు ఉంటాయని ఎస్ఐ వెంకటనారాయణ పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న అభిమానులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వేసవి దృష్ట్యా చిత్తూరు నగరంలోని పీసీఆర్ సర్కిల్‌లో ఆదివారం జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు చలివేంద్రం ప్రారంభించారు. మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు రాజేష్, తులసీకృష్ణ, జన, అంజాద్, హరితేజ, రెబెల్ జోష్నా, బాలాజీ, ఉదయ్, లోకి, వినోద్, ఉమేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఘనంగా కుంభాభిషేకం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం మురకంబట్టులోని కోలాతమ్మ ఆలయ కుంభాభిషేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవాలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి హారతి అందించారు. ముందుగా హోమాది పూజలు వేద మంత్రోచ్ఛరణలతో సాగాయి.

సెలవుల్లో బీ కేర్ ఫుల్..!

- సరదాగా ఈతకెళ్లి మృతి చెందుతున్న పిల్లలు
- ప్రమాదకరంగా మారిన చెరువులు, గుంతలు
- ప్రమాదాలకు తావిస్తున్న పర్యాటక ప్రాంతాలు
- కైగల్ వాటర్‌ఫాల్స్‌లో మృత్యులోయ
- కౌండిన్యలోనూ పలు ప్రమాదకర ప్రదేశాలు
- పిల్లలపై తల్లిదండ్రుల నిర్లక్ష్యం వద్దు



చెరువులోని గుంతల్లో ఈత కొడుతున్న పిల్లలు (ఫైల్)

పలమనేరు: విద్యార్థులకు వేసవి సెలవులొస్తున్నాయంటే తల్లిదండ్రులకు ఆందోళన తప్పడంలేదు. పిల్లల వినోదం, సరదా కాస్తా విషాదంగా మారిన ఎన్నో సంఘటనలు గతంలో చోటుచేసుకున్నాయి. చెరువులు, కుంటలు, అడవుల్లోని గుంతలు ఎప్పుడు ఎవరిని బలిగొంటాయో తెలియని పరిస్థితి. ఏటా వేసవి సెలవుల్లో యువత, చిన్నారుల ప్రాణాలను ఇవి హరిస్తున్నాయి. నీటిలో ఆడుకోవడం కోసం సంతోషంగా వెళ్లే పిల్లలకు ఎక్కడ ఎలా ప్రమాదం ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈత తెలిసిన వారి విషయంలో భయపడాల్సిన పనిలేకుండా ఈత రాని పిల్లలు, యువకులు విషయంలో మాత్రం జాగ్రత్త వహించాల్సి ఉంది.

పదేళ్లలో 25మంది నీళ్లలో మునిగి మృతి

పదేళ్ల కాలంలో పలమనేరు నియోజకవర్గంలో 25 మంది నీళ్లలో మునిగి మృతి చెందారు. గతంలో పట్టణానికి చెందిన కొందరు విద్యార్థులు చెరువులో ఈతకెళ్లి మృతి చెందారు. ఇక గ్రామాల సమీపంలోని పలు చెరువుల్లో ఇటుకల కోసం లేదా ఇతర అవసరాల కోసం అక్రమార్కులు మట్టిని తోడేశారు. వర్షాకాలంలో వీటిల్లోకి నీరు చేరింది. సంబంధిత చెరువు లేదా కుంటల లోతు, లోపలి పరిస్థితులు మొదలైన వాటి గురించి అవగాహన లేక సరదాగా నీళ్లలోకి వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇక కొన్ని చెరువుల కింది బావులు, అటవీప్రాంతానికి సమీపంలోని బావులు, కట్టడపురాయి బావులలో లోతును అంచనా వేయలేకపోవడం, పూడు ఎక్కువగా ఉండడం, బావి లోపల పాచి, రాళ్లూరప్పలు ప్రమాదాలకు కారణమతున్నాయి.

ఇవి మరీ ప్రమాదకరం

యువత సెలవుల్లో సరదాగా గడిపేందుకు అడవిలోని కొత్త ప్రాంతాలకు వెళ్లడం, అక్కడున్న వాగుల్లో, చెరువుల్లో స్నానాలకు వెళ్లడం కూడా ప్రమాదాలకు తావిస్తోంది. ఇక స్థానిక జలపాతాలైన కైగల్ దుముకురాళ్ల, కళ్యాణరేవులు, గంగన్న శిరస్సు, వైఎస్ఆర్ జలాశయాలకు వెళ్లి ఈతరాని వారు ప్రాణాలు కోల్పోతున్నారు. ముఖ్యంగా కైగల్ వాటర్‌ఫాల్స్‌లోని మృత్యులోయ ఇప్పటికే పలువురిని కబళించింది. ఇక్కడి సుడిగుండం కారణంగా నీటిలోకి దిగితే మళ్లీ పైకి రావడం సులభం కాదు. ముఖ్యంగా ఈ వేసవి సెలవులు ముగిసే వరకు పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది.



బావుల్లో ఈతకొడుతున్న పిల్లలు

నోటీస్ బోర్డు

నేడు అంబేడ్కర్ జయంతి వేడుకలు



పలమనేరు: పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సోమవారం నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతి వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ హాజరవుతారని పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ హేమంత్ కుమార్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఆయన కోరారు.

గంగవరంలో..

గంగవరం: అంబేడ్కర్ జయంతిని సోమవారం ఉదయం 8 గంటలకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

మెగా వైద్య శిబిరం

పుంగనూరు: అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని సోమవారం స్థానిక చింతలవీధిలోని మున్సిపల్ స్కూల్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు అబ్దుల్ కలామ్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ అయూబ్‌ఖాన్ ఆదివారం విలేకరులకు తెలిపారు. బెంగళూరుకు చెందిన సప్తగిరి హాస్పిటల్ సహకారంతో గుండె, న్యూరో, కిడ్నీ, క్యాన్సర్‌తో పాటు అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు చేస్తారని, దీనిని పట్టణ, మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మార్కులు కాదు.. పిల్లలు ముఖ్యం

గుడుపల్లె: మార్కులు కాదు.. పిల్లలు ముఖ్యమని తల్లిదండ్రులు గుర్తెరగాలని ఎస్ఐ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయని, అలాగే త్వరలో పదవ తరగతి పరీక్ష ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తక్కువ మార్కులు వచ్చాయనో , ఫెయిల్ అయ్యావనో తల్లిదండ్రులు మందలించడం వల్ల క్షణికావేశంలో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడం ఇటీవల కాలంలో చూస్తున్నామని, పరీక్షలలో ఫెయిల్ అయితే మళ్లీ రాసుకునే అవకాశం ఉంటుందని, కానీ జీవితమే లేకుండా పోతే ఆ నరకం అంతా ఇంతా కాదన్నారు. పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు చాలా మంది జీవితంలో గొప్పవారు ఆయ్యారన్నారు. అలాంటి వారి ఉదాంతాలను తల్లిదండ్రులు పిల్లలకు తెలియజేసి వారిలో నూతనోత్సాహం నింపాలన్నారు. వారితో ఆప్యాయంగా మాట్లాడి విజయం సాధించే దిశగా వారికి భవిష్యత్తు ప్రణాళికలు తెలియజేయాలని కోరారు.

కంటి ఆపరేషన్లకు 19మంది ఎంపిక



బైరెడ్డిపల్లె: కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

బైరెడ్డిపల్లె: స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆదివారం శంకర నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 40 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి 19 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ల అనంతరం వారికి కళ్లద్దాలు ఇస్తామని నిర్వాహకులు తెలిపారు. వైద్యాధికారులు మురళీకృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పుంగనూరు: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. ఎస్ఐ లోకేష్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. కుప్పం పీఈఎస్ వైద్యులు శిబిరంలో రోగులను పరీక్షించారు. శిబిరంలో ఎంపికైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు అందజేస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తి రెడ్డి తెలిపారు.

పింఛనర్ల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత నకరాదే



నకరా జయంతిని నిర్వహిస్తున్న పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు, సభ్యులు

పలమనేరు: ప్రస్తుతం దేశంలో పెన్షన్‌పొందుతున్న వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు నకరానేనని ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు గురురాజారావు అన్నారు. పెన్షనర్ల పితామహుడు నకరా 111వ జయంతిని ఆదివారం పట్టణంలోని నార్త్ పాఠశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. ఆయన మాట్లాడుతూ, పెన్షన్ విధిగా ఇవ్వాలని రూలింగ్ సుప్రీంకోర్టు ఇవ్వవడం వెనుక నకరా ఎంతగానో కృషి చేశారని కీర్తించారు. ఆయన కృషి ఫలితంగానే ఎంతోమంది విశ్రాంత ఉద్యోగులకు వృద్ధాప్యంలో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, గౌస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

16 నుంచి పానాటూరులో మహాభారత యజ్ఞం



మహాభారత యజ్ఞానికి ముస్తాబవుతున్న ఆలయం

గుడిపాల: మండలంలో పానాటూరు గ్రామంలో ఈ నెల 16వ తేదీ నుంచి మహాభారత యజ్ఞం నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు భాగవతారిణి హేమలత హరికథా కాలక్షేపం ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 24వ తేదీ నుంచి 10 రోజుల పాటు పాండురంగ నాటక మండలిచే వీధినాటకం నిర్వహించనున్నట్లు చెప్పారు. దీంతో పాటు 14న ఉదయం గ్రామంలో అమ్మవారికి అభిషేకం, 15న అంబలిపోయుట, 16న ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, 24వ తేదీ సాయంత్రం బలిబండి కార్యక్రమం, 27వ తేదీన 10 గంటలకు అమ్మవారి కల్యాణం, మే 4న ఉదయం 10గంటలకు దుర్యోధన వధ, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశ పట్టాభిషేకం, మే 5న సాయంత్రం 4గంటలకు వసంతోత్సవం, పొంగళ్లు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కార్యవర్గం ఏకగ్రీవం




శంకరప్ప, సుబ్రమణ్యం

పెద్దపంజాణి: ఆదివారం స్థానికంగా వాల్మీకి సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవమైంది. వాల్మీకి రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్ భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా ఎం శంకరప్ప(ఎస్ఆర్ పేట), ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సుబ్రమణ్యం(పెద్దపంజాణి), గౌరవాధ్యక్షులుగా నాగేశ్వరరావు(పొట్టగానిపల్లె), ఉపాధ్యక్షులుగా రెడ్డెప్ప(బట్టందొడ్డి), ప్రభాకర్(చలమంగలం), సుబ్రమణ్యం(ముత్తుకూరు), గణపతి(ముదరంపల్లె), కోశాధికారిగా మహేష్(పెద్దవెలగటూరు) ఎంపికయ్యారు. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కార్యవర్గం తెలిపింది.

సోమేశ్వరస్వామి విహారం



మంటపోత్సవంపై ఊరేగుతున్న సోమేశ్వరస్వామి

పుంగనూరు: పట్టణంలో నగిరివీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆదివారం మంటపోత్సవంపై స్వామివారి విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. అర్చకులు షణ్ముక దీక్షితులు స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి



ఏనుగు విరిచేసిన మామిడి చెట్లు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దేవళంపేట పంచాయతీ మర్రి కుంటవారిపల్లెలో ఆదివారం తెల్లవారుజామున పంటలపై ఒంటరి ఏనుగు దాడి చేసింది. మామిడి, కొబ్బరి, వరి పంటలను నాశనం చేసింది. నెల రోజులుగా దేవళంపేట, పొల్యం పంచాయతీల్లో తిష్ట వేసిన ఒంటరి ఏనుగు పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తోంది. దీనిమూలాన అటు రైతన్నలకు, ఫారెస్టు అధికారులకు కంటికి కునుకు కరువైతోంది. రోజూ ఎక్కడో ఒకచోట ఇది దాడి చేయడం నిత్యకృత్యంగా మారడంతో గ్రామాల్లోని రైతులు బెంబేలెత్తుతున్నారు. రాత్రి మర్రికుంటవారిపల్లెకు చెందిన ధర్మేంద్ర కొబ్బరి, మామిడి చెట్లను విరిచేసింది.

రమణీయం.. రథోత్సవం



బ్రహ్మరథంపై కొలువుదీరిన గంగాదేవి, పార్వతీదేవి సమేత సోమేశ్వరస్వామి

బైరెడ్డిపల్లె: మండలంలోని నాగిరెడ్డిపల్లె–టీఎస్ కుప్పం గ్రామాల మధ్యలో కొలువై ఉన్న శ్రీసోమేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం రథోత్సవం రమణీయంగా సాగింది. రంగురంగుల పుష్పాలతో అలంకరించిన బ్రహ్మరథంపై గంగాదేవి, పార్వతీదేవి సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టు రథంతో ప్రదక్షిణలు చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

రీ సర్వేలో తప్పులు చేస్తే చర్యలు



బండకిందపల్లెలో రీ సర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ కిరణ్‌కుమార్

రొంపిచెర్ల: రీ సర్వే పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ కిరణ్‌కుమార్ ఆదేశించారు. ఆదివారం బండకిందపల్లె గ్రామ పంచాయతీలో చేస్తున్న రీ సర్వే పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులకు భూ సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు భూముల సర్వేతో ఆన్‌లైన్‌లో తప్పులను సరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా రొంపిచెర్ల మండలంలోని బండకిందపల్లె గ్రామ పంచాయతీని ఎంపిక చేశారని తెలిపారు. గ్రామంలో ప్రతి సర్వే నంబర్ కొలతలు తీసి రైతు పేరుతో నమోదు చేయాలన్నారు. ఏవైనా భాగ పరిష్కారాలు ఉంటే వాటిని వారి సమక్షంలోనే పరిష్కరించాలన్నారు. ఎక్కడైనా తప్పిదాలు చేస్తే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో ముబారక్, సచివాలయ సర్వేయర్లు హరీష్, మానస, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మట్టలాదివారం




సీఎస్ఐ చర్చిలో మట్టలాదివారం పండుగను నిర్వహిస్తున్న పాస్టర్ రాకేష్ నిమ్రోడ్ తదితరులు (డీసీ)

పుంగనూరు: స్థానిక సీఎస్ఐ చర్చిలో ఆదివారం మట్టలాదివారం పండుగను క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలతో నిర్వహించారు. పాస్టర్ రాకేష్ నిమ్రోడ్ ఆధ్వర్యంలో ఈత మట్టలను చేతబట్టి చర్చి చుట్టూ కీర్తనలతో యేసుక్రీస్తును స్తుతిస్తూ తిరిగారు. అనంతరం మట్టలాదివారం ప్రత్యేకతపై చర్చిలో పాస్టర్ వాక్య సందేశమిచ్చారు. యేసుక్రీస్తు సిలువ వేయడానికి ముందు యేరూషలేము పట్టణంలో ప్రవేశించినప్పుడు ప్రజలు ఆయనను రాజులకు రారాజుగా, దైవ కుమారుడిగా కీర్తిస్తూ ఘన స్వాగతం పలకడాన్ని గుర్తుచేసుకుంటూ ఈ పండుగను ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించడం ఆనవాయితీ అని చెప్పారు. క్రైస్తవులు ప్రేమానురాగాలతో, సహృద్భావంతో అందరితో కలిసి మెలసి ఉండాలన్నారు. ఆరాధన కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, ప్రతినిధులు భరత్‌భూషణ్, సురేష్, క్రిష్టఫర్, ఉదయ్‌కుమార్, కృపాకర్, చిట్టి, హేమంత్‌కుమార్, ఎస్తేర్ హేమలత, ప్రభావతి, సుకన్య, భారతి, హెప్సిబా, సుమిత్ర, సరళ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవ కమిటీ నియామకం

- 25 రోజులకే పరిమితం.. సభ్యులు మాత్రమే ఎన్నిక
- సభ్యులుగా అనర్హుల నియామకంపై విమర్శలు



కుప్పం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయం

కుప్పం : శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ కమిటీ నియామకం ఎట్టకేలకు ప్రభుత్వం ప్రకటించింది. సాధారణంగా చైర్మన్‌తో పాటు 11 మంది సభ్యులతో రెండేళ్ల వ్యవధి కాలం ఇస్తూ కమిటీని ప్రకటించేది. కాగా ఈసారి మే 1వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాల నిర్వహణ కోసం ఉత్సవ కమిటీని నియమించినట్లు ప్రత్యేక జీఓను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. 11 మంది సభ్యులతో కలిగిన కమిటీ ఎవరికీ చైర్మన్, వివిధ పదవులు ప్రకటించలేదు. అందరూ సమానంగా ఉత్సవ కమిటీ సభ్యులుగానే నియమించినట్లు ఎండోమెంట్ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. కేవలం 25 రోజుల జాతర ఉత్సవాలు ముగిసేంత వరకే కమిటీ సభ్యులు పదవుల్లో కొనసాగుతారు. శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ దేవస్థానం జాతర ఏటా మే నెలలో మూడు రాష్ట్రాల కూడలి మధ్య ఘనంగా నిర్వహిస్తారు. ఈ నిర్వహణ కోసం కేవలం 11 మంది సభ్యులను 25 రోజుల కాలం పాటు నియమించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కమిటీలో 11 మంది సభ్యులుండగా అనర్హులకు కమిటీ సభ్యులుగా నియమించారంటూ విమర్శలు చెలరేగుతున్నాయి. సాధారణంగా అమ్మవారి ఉత్సవ ఊరిగింపునకు వెళ్లే సరిహద్దుల్లో ఉన్న వారికి కమిటీ సభ్యులుగా అవకాశం కల్పిస్తారు. కాగా పక్క మండలాలకు చెందిన అధికార పార్టీ నేతల ఆధార్ కార్డుల్లో అడ్రస్సులను మార్చి సభ్యులుగా ప్రకటించారంటూ ఓ సామాజిక వర్గం బలంగా వ్యతిరేకిస్తోంది. నూతనంగా నామినేటెడ్ పదవులు పొందిన ఓ నాయకుడి కనుసైగల్లో పదవులు కట్టబెడుతున్నట్లు పార్టీలోని మరో వర్గం భగ్గుమంటోంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం బి.ఎం.కె.రవిచంద్ర, శారదమ్మ కోదండస్వామి, ఎస్.నరేష్, సి.సింధూ రాజ్‌కుమార్, మంజులామణి, సంతోషమ్మ, జయరామ్‌నాయుడు, ఎస్.మహేష్, ఎన్.వినాయక, వెన్నెలా శరవణ, వి.ఎ.లక్ష్మి, జ్యోతిష్ ఉత్సవ కమిటీ సభ్యులుగా నియామకమయ్యారు.